
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం, 28, సెప్టెంబర్, 2024



సోమశిలలో 54.258 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 54.258 టీఎంసీలు ఉన్నాయి. పైతట్టు నుంచి 17,200 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.77,880
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,069
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,281
సవర (8 గ్రాములు)	రూ.58,248

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34.0 /27.0

జిల్లాలో శనివారం వాతావరణం తేమగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం గాలిలో తేమ 60 శాతంగా నమోదైంది.

ఉపాధి నిధుల దోపిడీ

పేదల కడుపు కొట్టి దోచుకుంటున్న టీడీపీ నేతలు

ఓ సాఫ్ట్‌వేర్, వ్యాపారవేత్త, ఆర్‌ఎంపీ, బిల్డర్లు, బతుకుదెరువు కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లిన ప్రైవేట్ ఉద్యోగులూ 'ఉపాధి' కూలీలే. మస్టర్‌లో వీరి పేర్లు మాత్రమే ఉంటాయి. ఫొటోలు మరొకరివి ఉంటాయి. పేదలకు బతుకుదెరువు కల్పించేందుకు అమలు చేస్తున్న 'ఉపాధి హామీ' పథకాన్ని టీడీపీ నేతలు కల్పతరువుగా మార్చుకున్నారు. కూలీల కడుపు కొట్టి దొంగ మస్టర్లు వేసి తమ్ముళ్లు పంచుకుంటున్నారు. పనులు చేయకుండానే చేసినట్లు, కూలీలు హాజరు కాకపోయినా.. హాజరైనట్లు పక్కాగా రికార్డులు సృష్టించి, కూలీలకు పదో పరకో ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు.



కందుకూరు మండలంలోని పలుకూరులో పని చేస్తున్న కూలీలు



పాలూరులో పని వద్దే వంద రూపాయలు వసూలు చేస్తూ...



వసూలు చేసిన నగదును జేబులో పెట్టుకుంటున్న లీడర్

- దొంగ మస్టర్లతో కూలీల సొమ్ము పంచుకుంటున్న వైనం
- జిల్లాలో కూలీల సంఖ్యలో కందుకూరు టాప్
- బదిలీపై వెళ్లేందుకు సిద్ధపడుతున్న ఉపాధి అధికారులు

కందుకూరు రూరల్: టీడీపీ నాయకులకు ఉపాధి హామీ పథకంగా వరంగా మారింది. పిట్టపోరు పిట్ట పోరు.. పిల్లి తీర్చిందన్న చందంగా చోటా నేతల వసూళ్లను ఆ పార్టీ పెద్ద నేతలు జేబులో వేసుకుంటున్నారు. మండలంలో చోటా నేతలు మేట్‌లుగా అవతారం ఎత్తి కూలీల వద్ద డబ్బు వసూలు చేస్తుండగా.. అవి తమ దాకా రావడం లేదనే అక్కసుతో ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. అయితే ఇంత పెద్ద మొత్తం తామెందుకు వదులుకుంటామంటూ ఏకంగా గ్రామ స్థాయి పెద్ద నేతలు రంగంలోకి దిగి ఆ వసూలు చేసిన డబ్బు తమ జేబుల్లో పెట్టుకుంటున్నారు.

పాత ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను పూర్తిగా మార్చేసి టీడీపీ అనుచరులుగా ఉన్న వారినే సీనియర్ మేట్లుగా, ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించుకున్నారు. వారిని అడ్డం పెట్టుకుని వసూళ్ల పర్వానికి తెర లేపారు. రోజూ మస్టర్లు తీసుకెళ్లేందుకు ఫీల్డ్ అసిస్టెంట్‌తో సంబంధం లేకుండా కాలనీకి ఒకరు, కులానికి ఒకరు చొప్పున సీనియర్ మేట్‌లు వెళ్లి వారానికి రూ.100, రూ.200 మేర వసూలు చేస్తున్నారు. పనిచేసినా చేయకపోయినా రోజుకు రూ.250 నుంచి రూ.270 వరకు కూలి చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుని కొత్త రకం దందాకు తెర లేపారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు వేధింపులు

కందుకూరు మండలంలోని పాలూరులో వైఎస్సార్‌సీపీకి చెందిన కూలీలు కొందరికి డబ్బులు ఇవ్వలేదు. దీంతో దాదాపు వారం రోజుల పాటు పని చూపించలేదు. చివరకు వారానికి వంద రూపాయలు ఇస్తామని చెప్పడంతో వారికి పనులు కల్పిస్తున్నారు. పని ప్రదేశంలోనే నిస్సిగ్గుగా వసూలు చేసుకుంటున్నారు. ఒక కూలి వారంలో ఒక రోజు పనికి వెళ్లినా, నాలుగు రోజులు పనికి వెళ్లినా వారానికి వంద రూపాయలు ముట్టజెప్పాల్సిందే. జీతాలు లేవని, పేపర్లకు, బైక్ ఆయిల్ ఖర్చులకు అంటూ బహిరంగంగానే దండుకుంటున్నారు.

ఇక్కడ పనిచేయలేం

కందుకూరు నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉపాధి అధికారులు, సిబ్బంది బదిలీపై వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. కూలీల వద్ద వసూలు చేయొద్దని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు, షోకాజ్‌లు వస్తున్నప్పటికీ కింది స్థాయిలో పార్టీ నేతలు వసూళ్లు ఆపడం లేదు. మా ఉద్యోగాలు ఎక్కడ పోతాయో అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయానికి వచ్చి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారని కూలీలే ఫిర్యాదు చేస్తున్నారు. ఇక్కడి నుంచి వేరే నియోజకవర్గాలకు వెళ్లిపోవాలని సంబంధిత శాఖ ఉద్యోగులు ప్రయత్నిస్తున్నారు.

సాఫ్ట్‌వేర్, బిల్డర్, ఆర్‌ఎంపీలు ఉపాధి కూలీలే

టీడీపీ నేతల దోపిడీకి ఈ ఉదంతం పరాకాష్ట. సాఫ్ట్‌వేర్, బిల్డర్, ఆర్‌ఎంపీ, పక్క రాష్ట్రాల్లో ఉండే ప్రైవేట్ ఉద్యోగులను ఉపాధి కూలీలుగా మార్చేశారు. గ్రామాల్లోనే లేని వారికి వలస కూలీల పేర్లతో దొంగ మస్టర్లు వేస్తూ దోచుకుంటున్నారు. తనిఖీల సమయంలో మాత్రం కొద్దిగా హాజరు శాతం తగ్గిస్తూ మిగిలిన రోజుల్లో రెచ్చిపోతున్నారు. ఈ నెల 10, 11, 12వ తేదీల్లో మస్టర్లు గమనిస్తే ఈ వ్యవహారం తేటతెల్లమవుతోంది.

- పాలూరుకు చెందిన డి.లక్ష్మీదేవి వేరే జిల్లాలో ఉంటుండగా, పావని హైదరాబాద్‌లో ఉంటోంది. చిన్న మంగళగిరి పనికే వెళ్లడు. ఈశ్వరి ఓ ప్రైవేట్ వైద్యశాలలో పని చేస్తోంటుంది. మంజుల, సుబ్బారావుది ఆర్‌ఎంపీ ఫ్యామిలీ, కె.మాధవరెడ్డి, కల్పన జిల్లాలో వ్యాపారం చేస్తుంటారు. వీరందరికీ దొంగ హాజర్లు వేసి జేబులు నింపుకుంటున్నారు. కంచరగుంట గ్రామంలో ఎస్.నరసింగరావు, బి.రమేష్, సునీత, పి.వెంకటేశ్వర్లు, భారతి, చింతం సులోచన, శ్రీనివాసులు, రమణయ్య హైదరాబాద్‌లో బిల్డర్లుగా జీవనం సాగిస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన కె.కనకవేణి, ఎన్.ధనమ్మ, యల్లమందయ్య, పి.ప్రభావతి, తిరుపతయ్య, జి.రత్తమ్మ, చిరంజీవి చెన్నైలో ఉంటారు. ఎస్.వెంకయ్య, కె.అరుణ, నల్లూరి నరశింగరావు, వరమ్మ, జి.ఉష, బ్రహ్మయ్య, జి.పద్మ, రామకోటయ్య, రవణమ్మ వీరు పనులకు వెళ్లరు. బెల్లం శ్రీహరి సాఫ్ట్‌వేర్‌గా ఉన్నాడు. అయితే వీరి స్థానంలో ఫొటోలు ఇతరులవి పెట్టి మస్టర్ మోసాలకు పాల్పడుతున్నారు.

న్యూస్‌రీల్

విర్రవీగితే భారీ మూల్యం తప్పదు

- మాజీమంత్రి కాకాణి హెచ్చరిక



పార్టీ సీనియర్ నేత దుంపా రామచంద్రారెడ్డిని పరామర్శిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

కలువాయి: అధికారం ఉందని టీడీపీ నాయకులు విర్రవీగుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని, రాబోయే రోజుల్లో భారీ మూల్యం చెల్లించక తప్పదని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. కలువాయి మండలం దాచూరులో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ మండల మాజీ కన్వీనర్ దుంపా రామచంద్రారెడ్డిని శుక్రవారం ఆయన పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్న ఎవరిని భవిష్యత్‌లో వదిలే ప్రసక్తే లేదన్నారు. తమ కుటుంబానికి చిరకాల మిత్రుడు, ఆప్తుడు దుంపా రామచంద్రారెడ్డి దేవుడి కృపతో త్వరగా కోలు కోవాలన్నారు. ఆయన నిరంతరం పార్టీ అభివృద్ధికి చేస్తున్న కృషిని కొనియాడారు. ఆయన వెంట పార్టీ నాయకుడు, జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

30 వరకు ఈకేవైసీ గడువు

నెల్లూరు (సెంట్రల్): ఈ క్రాప్, ఈ కేవైసీ నమోదుకు గడువును ఈ నెల 30వ తేదీ వరకు పెంచినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీతో గడువు ముగియడంతో జిల్లాలో మరికొంత మంది రైతులు ఈ కేవైసీ చేయాల్సి ఉండడంతో గడువు పెంచినట్లు తెలిపారు. తప్పకుండా ప్రతి రైతు ఈ కేవైసీని నమోదు చేయించుకోవాలని సూచించారు.

పర్యాటకంలో ఉద్యోగావకాశాలు పుష్కలం

- కలెక్టర్ ఆనంద్



టూరిజం కళాశాలలో పర్యాటక దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్

వెంకటాచలం: పర్యాటక రంగంలో ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయని, విద్యార్థులు వాటిని అందిపుచ్చుకోవాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. మండలంలోని గొలగమూడి వద్దనున్న ఐటీటీఎం కళాశాలలో శుక్రవారం జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాలు, దేశాల మధ్య సత్సంబంధాలు మెరుగు పడటంలో పర్యాటక రంగం ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. జిల్లాలో వందేళ్లు పైబడిన చరిత్ర ఉన్న కలెక్టరేట్ భవనం, బారాషహీద్ దర్గా, జిల్లా గ్రంథాలయం తదితర అనేక పురాతన భవనాలు ఉన్నాయని, అలాంటి చరిత్రాత్మక ప్రదేశాలను విద్యార్థులందరూ సందర్శించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు పర్యాటక రంగం గొప్పతనం తెలిసేలా జిల్లాలోని చరిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రదేశాల ప్రాధాన్యత తెలిసేలా డాక్యుమెంటరీలు తయారు చేసి సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసేలా చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి అన్ని చర్యలు చేపడతామని వివరించారు. కళాశాల విద్యార్థులతో ముచ్చటించి గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల నోడల్ అధికారి సంజీవరెడ్డి, కో ఆర్డినేటర్ శరవణన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అభిలాష్, జిల్లా టూరిజం అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(క్రైమ్): నెల్లూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్‌గా అక్కిశెట్టి శ్రీహరిరావు బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై నెల్లూరొచ్చారు. అనంతరం విజిలెన్స్ ఎస్పీ రాజేంద్రకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

పొలాల మధ్య పెట్రోలియం పైప్‌లైన్



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణప్రసాద్, సీఐ సుధాకర్‌రెడ్డి

- పల్లిపాడులో నిరసన వ్యక్తం చేసిన రైతులు
- రెవెన్యూ, పోలీసుల సహకారంతో బలవంతంగా పనుల ప్రారంభం

ఇందుకూరుపేట: పచ్చని పొలాలు, ఆక్వా చెరువుల మధ్యలో బీపీసీఎల్ పెట్రోలియం పైప్‌లైన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అయితే రైతుల అభీష్టానికి వ్యతిరేకంగా అత్యంత విలువైన భూములకు అరకొర పరిహారం ఇస్తామని రెవెన్యూ, పోలీసుల సహకారంతో బలవంతంగా పనులు ప్రారంభించడంతో తీవ్రంగా నష్టపోతున్నామని మండలంలోని పల్లిపాడులో రైతులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) కృష్ణపట్నం నుంచి హైదరాబాద్ వరకు పెట్రోలియం, గ్యాస్ సరఫరా కోసం పైప్‌లైన్ ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ పొలాలను నమ్ముకుని జీవిస్తున్న మాకు బీపీసీఎల్ తీవ్రనష్టం చేస్తోందన్నారు. గ్రామంలో 43 మంది రైతులు బాధితులుగా ఉన్నారని, మా అభ్యంతరాలను పట్టించుకోవడం లేదని వాపోయారు. ఒక ఎకరం రూ. 50 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటే రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం అందిస్తానని చెప్పడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. రోడ్డు పక్కన, బీడు భూముల్లో వేయకుండా పంటలు పండే పొలాల్లో బలవంతంగా తవ్వకాలు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఐదు మీటర్లు వెడల్పు స్థలం అవసరం ఉంటే సుమారు 18 మీటర్ల వరకు తీసుకొంటున్నారన్నారు. ఈ ప్రాంతంలో టెంకాయ, మామిడి వంటి పెద్ద చెట్లు నాటడం, నిర్మాణాలు చేపట్టొద్దని చెబుతున్నారన్నారు. న్యాయం చేయాలని కోర్టుకు వెళ్లామన్నారు. సంస్థ ప్రతినిధులు కోర్టుకు హాజరు కాకుండా, కౌంటర్లు వేయకుండా కావాలని వాయిదాలు వేసుకుంటూ ఇక్కడ పనులు వేగంగా చేస్తున్నారన్నారు. కోర్టు ఆదేశాలు వచ్చేంత వరకు పనులు సాగకుండా నిలుపుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సరైన పరిహారం అందజేసి, పైపులైన్ వేసే సమయంలో 15 అడుగుల లోతు వేస్తేనే రైతులు అంగీకరిస్తామని తేల్చి చెప్పారు. ప్రభుత్వం రైతుల పక్షాన నిలవకుండా పనులు చేసే సంస్థకు కొమ్ము కాయడం సరికాదని వాపోయారు.

బలవంతంగా పనులు

ఉన్నతాధికారులు ఆదేశాలు ఉన్నాయంటూ తహసీల్దారు కృష్ణప్రసాద్, సీఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బలవంతంగా పనులు ప్రారంభించారు. రెవెన్యూ అధికారులతో పాటు ఎస్సైలు నాగార్జునరెడ్డి, రంగనాథ్‌గౌడ్, నరేష్, ఆంజనేయులురెడ్డి, సంతోష్‌రెడ్డితో పాటు సిబ్బందితో మోహరించి పనులు చేపట్టారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. పనులు అడ్డుకునేందుకు ప్రయత్నించిన రైతులతో పాటు బీజేపీ నాయకులు రాంమోహన్‌రెడ్డి, కైలాసం శ్రీనివాసులురెడ్డి, సీపీఎం నాయకుడు ప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలేశారు.

ఎక్సైజ్‌లో బదిలీలకు కసరత్తు

- ఇప్పటికే జిల్లా స్థాయి అధికారుల బదిలీల పూర్తి
- రెండు రోజుల్లో సీఐలు, ఎస్సైలు..

నెల్లూరు (క్రైమ్): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో కింది అధికారుల బదిలీలు మొదలయ్యాయి. నూతన మద్యం విధానాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికే సెబ్‌ను రద్దు చేసి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో విలీనం చేసింది. ఉద్యోగుల సర్దుబాటు పూర్తయింది. జిల్లాలో డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఈఎస్, ఐఎంఎల్‌డిపో మేనేజర్, ఏఈఎస్‌ల నియామకాలు జరిగిపోయాయి. రెండు రోజుల్లో సీఐలు, ఎస్సైల బదిలీలను పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. చివరగా హెచ్‌సీ, పీసీల బదిలీలు నిర్వహించనున్నారు. జిల్లాలోని హెచ్‌సీ, పీసీలు 190 మంది ఎక్సైజ్ కార్యాలయంలో విల్లింగ్ ప్లేస్‌లకు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో శుక్రవారం బీవీనగర్‌లోని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సిబ్బందితో కోలాహలం నెలకొంది. సీఐలు, ఎస్సైలు, సిబ్బంది అనుకూల స్టేషన్లలో పోస్టింగ్‌లు దక్కించుకునేందుకు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధుల సిఫార్సు పత్రాలను అందజేస్తున్నారు. బదిలీల వ్యవహారంలో కొందరు బార్ల యజమానులు సైతం జోక్యం చేసుకుని ప్రజాప్రతినిధుల సిఫార్సు పత్రాలను ఇప్పిస్తున్నారు.

జిల్లాలో 216 మద్యం దుకాణాలు?

ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి ప్రైవేట్ దుకాణాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం జిల్లాలో 196 మద్యం దుకాణాలు ఉండగా నూతన మద్యం పాలసీ ప్రకారం 216 దుకాణాలు ఏర్పాటు కానున్నట్లు సమాచారం. వీటిలో గీత కార్మికులకు 23 దుకాణాలు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి లక్కీ డిప్ విధానంలో అనుమతులు కేటాయించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సంక్షేమ విద్యార్థుల 'ఆకలి కేకలు'

సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లోని పేద విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. అప్పులు చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించలేక వార్డెన్లు చేతులెత్తేస్తున్నారు. తొమ్మిది నెలలుగా డైట్ చార్జీలు ప్రభుత్వం చెల్లించలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఠంచన్‌గా చార్జీలను చెల్లిస్తుండేది. గతేడాది డిసెంబరు వరకు ఉన్న పెండింగ్ బిల్లులను ఇచ్చింది. మార్చిలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆగిపోయిన బిల్లులకు ఈ రోజుకూ మోక్షం లభించలేదు. మరో వైపు రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలతో పాటు అప్పులతో కనీసం ఒక్క పూట కూడా కడుపు నిండా భోజనం పెట్టలేని పరిస్థితిలో వార్డెన్లు ఉన్నారు.

- జనవరి నుంచి మంజూరు చేయని బిల్లులు
- మార్చిలో ఎన్నికల కోడ్‌తో ఆగిన వైనం
- నిత్యావసర సరుకులు, కూరగాయల ధరల ప్రభావం
- అప్పులు పుట్టక చేతులెత్తేస్తున్న వార్డెన్లు
- వసతిగృహాల విద్యార్థులను పట్టించుకోని ప్రభుత్వం



వసతి గృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులు



భోజనంలో కనిపించని నాణ్యత, మెనూ

ఉదయగిరి: జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించి 146 వసతి గృహాలు ఉన్నాయి. ఈ గృహాల్లో సుమారు 11 వేల మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. వీరికి ప్రభుత్వం ప్రత్యేకంగా మెనూ రూపొందించి, ఆ ప్రకారం భోజనం అందిస్తోంది. సివిల్ సప్లయిస్ నుంచి బియ్యం సరఫరా చేస్తోంది. కిరాణా సరుకులు నెల వారీగా కాంట్రాక్టర్లకు అప్పగించడంతో వారు నెలకు సరిపడా 18 రకాల సరుకులు నేరుగా వసతి గృహాలకు సరఫరా చేస్తున్నారు. పాలు, గుడ్లు, చికెన్, వంట గ్యాస్ తదితర వాటిని మెనూ చార్జీల రూపంలో చెల్లిస్తోంది. అయితే బిల్లులు చెల్లించకపోవడంతో కిరాణా సరుకుల కాంట్రాక్టర్లు సరఫరా చేయలేక నిలిచిపోయారు. ఆగస్టుతో వీరి కాంట్రాక్ట్ కాలపరిమితి కూడా తీరిపోయింది. జిల్లా వ్యాప్తంగా అన్ని వసతి గృహాలకు కలుపుకొని సుమారు రూ.10 కోట్ల మేర బకాయిలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

9 నెలలుగా అందని బిల్లులు

సివిల్ సప్లయిస్, కిరాణా సరుకుల కాంట్రాక్టర్లు, మెనూ చార్జీలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు క్లియర్ చేస్తుండేది. గతేడాది డిసెంబర్ నాటికి ఉన్న అన్ని బకాయిలను ప్రభుత్వం చెల్లించింది. అయితే మార్చిలో బిల్లులు చెల్లించాల్సి ఉండడంతో అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో బిల్లులు చెల్లింపు ప్రక్రియ నిలిచిపోయింది. అయితే కిరాణా సరుకుల కాంట్రాక్టర్లు మరికొంత కాలం పాటు సరుకులు సరఫరా చేశారు. ఇక విద్యార్థులకు సంబంధించి మెనూ చార్జీలు చెల్లించకపోవడంతో ఈ భారమంతా వార్డెన్లపై పడింది. తాజాగా రెండు మూడు నెలలుగా సరుకులు కూడా కాంట్రాక్టర్లు సరఫరా చేయడం లేదు. దీంతో వార్డెన్లకు గోరుచుట్టుపై రోకటి పోటులా మారింది. తొమ్మిది నెలలుగా మెనూ చార్జీలు లేకపోవడం, సరుకుల కొనుగోలుతో ఎడాపెడా అప్పులు చేస్తున్నారు. ఇప్పుడు అప్పులు ఇచ్చేవారు కరువు కావడంతో పిల్లలకు కడుపు నిండా నాణ్యమైన భోజనం పెట్టలేకపోతున్నామని వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ వసతి గృహాలు	విద్యార్థులు
146	11 వేల మంది
తొమ్మిది నెలలు బకాయిలు సుమారు రూ.10 కోట్లు	

మెనూ చార్జీలిలా..

పాఠశాల వసతిగృహాల్లో ఒక్కొక్క విద్యార్థికి రోజుకు రూ.46, కాలేజీ విద్యార్థులకు రూ.53 భోజన ఖర్చులకు చెల్లిస్తోంది. 3 నుంచి 4 తరగతులు చదివే వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.1,150, 5 నుంచి 10వ తరగతి వారికి రూ.1,400, కాలేజీ విద్యార్థులకు రూ.1,600 చెల్లిస్తుంది. మెనూ ప్రకారం వారానికి ఆరు గుడ్లు, ప్రతి ఆదివారం బిరియాని, అరటి పండ్లు, పాలు, కూరగాయలతో కూడిన ఆహారం పెట్టాలి. చికెన్, కోడిగుడ్లు, గ్యాస్, పాలు, కూరగాయలు అప్పులు ఇవ్వడం లేదని వార్డున్లు చెబుతున్నారు.

పెరిగిన ధరల ప్రభావం

కూటమి ప్రభుత్వం కొలువు తీరిన నాటి నుంచి నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ప్రధానంగా తెల్లగడ్డలు కిలో రూ.350, అల్లం రూ.170, ఉల్లిపాయలు రూ.70 వరకు విక్రయిస్తున్నారు. ఇతర మసాలా సరుకులు కూడా అదే రీతిలో ఉన్నాయి. టమోటా, ఉల్లగడ్డలు, పచ్చి మిర్చి కేజీ రూ.60 వరకు పలుకుతోంది. ఇతర అన్నీ కూరగాయలు కూడా కిలో రూ.40 తక్కువ లేదు. రోజు రోజుకు ధరలు పెరుగుతుంటే నాణ్యమైన భోజనం ఎలా పెట్టాలని వార్డెన్లు ప్రశ్నిస్తున్నారు.

నిధులు నిల్

వసతి గృహాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో విద్యుత్ బిల్లులు, మరుగుదొడ్ల నిర్వహణ, చిన్నపాటి మరమ్మతులకు సొంత సొమ్ము పెట్టాల్సి వస్తోందని, నెలకు రూ.3 వేల నుంచి రూ.5 వేలు వరకు ఖర్చవుతుందని వార్డెన్లు చెబుతున్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు చెప్పినా, బడ్జెట్ రాలేదని అంత వరకు వేచి ఉండాలని చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని రకాల బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

వీధి బాలలకు చదువుల భాగ్యం



నెల్లూరు పెన్నానదిలో చిల్లర నాణేలు ఏరుకుంటున్న చిన్నారులపై 'సాక్షి' శుక్రవారం ప్రచురించిన ఫొటోపై ఐసీడీఎస్ అధికాలు స్పందించారు. పేదింటి పిల్లలకు బంగారు భవిష్యత్ కలుగజేస్తామని చెప్పారు. ఆ బాలబాలికలను సంరక్షణ కేంద్రంలో ఉంచి చదివిస్తామని పెన్నా ఒడ్డున గుడిసెల్లో ఉంటున్న తల్లిదండ్రులకు నచ్చజెప్పారు. ఆ చిన్నారులను పాఠశాలలకు పంపేందుకు తల్లిదండ్రులు కూడా ఒప్పుకున్నారు. – ఫొటో, సాక్షి ఫొటోగ్రాఫర్

క్లుప్తంగా

స్వల్పంగా తగ్గిన నిమ్మ ధరలు

పొదలకూరు: నిమ్మకాయల ధరలు స్వల్పంగా తగ్గాయి. బస్తా (లూజు) టాప్ ధర రూ.ఎనిమిది వేలు ఉండగా, ప్రస్తుతం రూ.ఏడు వేలు పలుకుతోందని వ్యాపారులు తెలిపారు. కిలో వంతున చూస్తే రూ.50 నుంచి రూ.90 వరకు పలుకుతున్నాయి. తోటల్లో కాయల దిగుబడి పూర్తిగా తగ్గడంతో నిమ్మకాయలకు డిమాండ్ బాగా పెరిగింది. అయితే నాణ్యత లేకుండా వస్తున్న కాయలతో టాప్ ధర పతనమైంది. దసరా వరకు ఇలాగే ఉంటుందని, అయితే ఈ ఏడాది నిమ్మ ధరలు పలికనట్లు మునుపెన్నడూ జరగలేదని వ్యాపారులు తెలిపారు. సెప్టెంబర్‌లో ఈ స్థాయిలో ధరలు గిట్టుబాటవుతున్నా, రైతుల తోటల్లో కాయల్లేకపోవడం నిరాశ కలిగిస్తోంది.

పశుసంవర్ధక శాఖ కావలి డీడీగా మల్లారెడ్డి

నెల్లూరు(సెంట్రల్): పశుసంవర్ధక శాఖ కావలి డిప్యూటీ డైరెక్టర్‌గా మల్లారెడ్డిని నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులను శుక్రవారం జారీ చేశారు. అనంతపురం ఏడీగా పనిచేస్తున్న ఆయన్ను పదోన్నతిపై ఇక్కడ నియమించారు. కాగా కావలి డీడీగా పనిచేస్తున్న రమేష్ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా నియమితులయ్యారు.

స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ ఫైనాన్స్ సభ్యుడిగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలకు చైర్మన్లు, సభ్యులను నియమిస్తూ బులెటిన్‌ను విడుదల చేశారు. ఇందులో భాగంగా ఆయన నియమితులయ్యారు. కమిటీకి చైర్మన్‌గా ఎంపీ భర్తృ హరి మెహతాబ్ వ్యవహరించనున్నారు.

స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు సిటీ: స్టోన్‌హౌస్‌పేట స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ సబ్ రిజిస్ట్రార్‌గా రాధాకృష్ణమూర్తి బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. ప్రకాశం జిల్లా మార్కాపురం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఈయన్ను ఇక్కడికి బదిలీ చేశారు. ప్రధాన రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సింహాద్రినాయుడికి జాయింట్ – 2 సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలను అప్పగించారు.

ఇద్దరు డీటీలకు అడ్‌హాక్ పదోన్నతులు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా అడ్‌హాక్ పదోన్నతులను కల్పిస్తూ ఉత్తర్వులను కలెక్టర్ ఆనంద్ జారీ చేశారు. వెంకటాచలంలో ఎలక్షన్ డీటీగా పనిచేస్తున్న మురళిని దగదర్తి.. కొండాపురంలో డీటీగా పనిచేస్తున్న కోటేశ్వరరావును కొండాపురం తహసీల్దార్లుగా నియమించారు.

ఇసుక అక్రమ రవాణాపై దాడులు

నెల్లూరు(క్రైమ్): భగత్‌సింగ్ కాలనీ సమీపంలో ఇసుక అక్రమ రవాణాపై నవాబుపేట పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున దాడులు చేశారు. ఎలాంటి అనుమతుల్లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ హేమంత్‌పై కేసు నమోదు చేశారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు తప్పవని ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా హెచ్చరించారు.

కుష్టు రహిత సమాజానికి కృషి



సమీక్షిస్తున్న ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): కుష్టు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కుష్టు, క్షయ నివారణాధికారి, ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ సూచించారు. కుష్టువ్యాధిపై డీపీఎంఓలతో సమీక్ష సమావేశాన్ని సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రారంభ దశలోనే గుర్తిస్తే మందుల ద్వారా చికిత్స చేసి కుష్టును నివారించొచ్చని చెప్పారు. డాక్టర్ సురేంద్ర, మెడికల్ ఆఫీసర్ సునీత, ఫిజియోథెరపిస్ట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 134
లేయర్ (లైవ్)	: 115
బ్రాయిలర్ చికెన్	: 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 264
లేయర్ చికెన్	: 195

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.90
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.35

తాళాలేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- రూ.5.01 లక్షల సొత్తు స్వాధీనం



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): తాళాలేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నిందితుల వివరాలను నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్ వెల్లడించారు. బెంగళూరుకు చెందిన నవీన్ వ్యసనాలకు బానిసై దొంగగా మారి కొంత కాలంగా బుచ్చిరెడ్డిపాళెంలోని రెడ్డిపాళెంలో ఉంటున్నారు. మద్యం తాగేందుకు వెళ్లిన సమయంలో పాతనేరస్తులైన వెంకటేశ్వరపురం జనార్దన్‌రెడ్డికాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బు, మసీదు వీధికి చెందిన అబ్దుల్ లతీఫ్ అలియాస్ బ్రిజ్‌తో పరిచయం ఏర్పడింది. ముగ్గురూ ముఠాగా ఏర్పడి జిల్లాలో తాళాలేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడసాగారు. చోరీ చేసిన సొత్తును విక్రయించి విలాసవంతంగా జీవనం సాగిస్తున్నారు.

నిందితుల గుర్తింపు.. అరెస్ట్ ఇలా..

కొత్తూరులోని జర్నలిస్ట్ కాలనీకి చెందిన నరసారెడ్డి తన కుటుంబంతో కలిసి అమెరికా వెళ్లారు. ఈ క్రమంలో సెప్టెంబర్ పదో తేదీ అర్ధరాత్రి దాటాక ఆయన ఇంట్లో ముగ్గురు యువకులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు అప్రమత్తమవ్వడం, పోలీసుల రాకతో దుండగులు పరారయ్యారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తును ప్రారంభించారు. సాంకేతికత, ఘటన స్థలంలో లభ్యమైన వాటి ఆధారంగా నిందితులను నవీన్, సుబ్రహ్మణ్యం, లతీఫ్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా.. వేదాయపాళెం, కొడవలూరు, కోవూరు, నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడ్డామని నిందితులు అంగీకరించడంతో అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ 5.01 లక్షల విలువజేసే బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, ఎల్‌ఈడీ టీవీ, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

నిందితులపై పలు కేసులు

వ్యసనాలకు బానిసై దొంగగా మారిన నవీన్‌పై గతంలో 15, తాజాగా నాలుగు కేసులున్నాయి. సుబ్రహ్మణ్యంపై ఇప్పటికే పలు దొంగతనం కేసులున్నాయి. పలుమార్లు జైలుకెళ్లొచ్చారు. నిందితుడిపై నవాబుపేట పోలీస్‌స్టేషన్లో సస్పెక్టెడ్ షీటుంది. లతీఫ్‌పై మొత్తం ఏడు కేసులున్నాయని డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తు రాబట్టేందుకు కృషి చేసిన వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్, ఎస్సై వెంకట్రావు, క్రైమ్ పార్టీ ఏఎస్సై ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు, కానిస్టేబుళ్లు గోపాల్, నాగరాజు, చంద్రవర్ధన్ తదితరులను డీఎస్పీ అభినందించి రివార్డులను ప్రకటించారు.



స్వాధీనం చేసుకున్న సొత్తు

సస్పెండైన ఏపీఎం మాకొద్దు

- వ్యతిరేకిస్తున్న పొదుపు సంఘాలు

వింజమూరు(ఉదయగిరి): సస్పెండైన ఏపీఎం మాకొద్దని పొదుపు సంఘాలు తేల్చిచెప్తున్నాయి. వాస్తవానికి పొదుపు సంఘాల నిధులతో వింజమూరులో మహిళా మార్టును గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. మండలంలో పొదుపు సంఘాల ద్వారా పెట్టుబడి నిధి కోసం రూ.16.25 లక్షలను సేకరించారు. వ్యాపారం చేసి తద్వారా వచ్చిన లాభాలను సంఘాలకు పంపిణీ చేయాల్సి ఉన్నా, అలా జరగలేదు. నాసిరక సరుకులను తీసుకొచ్చి అధిక ధరలకు పొదుపు సంఘాల సభ్యులకు అంటగట్టసాగారు. దీంతో కొంత కాలం భరించిన పొదుపు సభ్యులు తిరగబడ్డారు. తాము పెట్టిన పెట్టుబడి నిధికి లెక్కలు చూపి లాభాలివ్వాలని డిమాండ్ చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి కలెక్టర్ హరినారాయణన్ విచారణకు ఆదేశించారు. ఇందులో అక్రమాలు వెలుగు చూడటంతో ఏపీఎం సాల్మన్ రోజ్‌ను సస్పెండ్ చేశారు. మరి కొంత మంది అధికారుల ప్రమేయమున్నా, పలుకుబడితో సస్పెన్షన్ వేటు నుంచి తప్పించుకున్నారు.

వింజమూరుకు వచ్చేందుకు యత్నాలు

కాగా ప్రభుత్వ పెద్దలు, ఓ ఉన్నతాధికారి సహకారంతో ముడుపులు అందజేసి సస్పెన్షన్‌ను రద్దు చేయించుకొని వింజమూరుకు వచ్చేందుకు సదరు ఏపీఎం యత్నాలు చేస్తున్నారని సమాచారం. సస్పెండైన చోటే మరోసారి పోస్టింగ్ ఇస్తారనే సమాచారంతో పొదుపు మహిళలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మార్టు మూతపడిందని, మంచి అధికారిని నియమించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న జేసీ కార్తీక్



పోటీలకు హాజరైన విద్యార్థులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): విద్యతో పాటు క్రీడల్లో రాణించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పేర్కొన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు, పోటీలను జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. క్రీడలను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని, ఈ తరుణంలో యువతను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, శిక్షకులకు సూచించారు. అనంతరం డీఈఓ రామారావు మాట్లాడారు. క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులను పారదర్శకంగా ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కాంక్షించారు. తొలుత క్రీడాకారులను జేసీ పరిచయం చేసుకున్నారు. ఏసీ స్టేడియంలో టేబుల్ టెన్నిస్, రగ్బీ, తైక్వాండో, బ్యాడ్మింటన్, ఖోఖో.. బుచ్చిరెడ్డిపాళెంలోని రెయిన్‌బో హైస్కూల్లో ఫెన్సింగ్.. కావలి జెడ్పీహెచ్‌ఎస్‌లో రోప్ స్కిప్పింగ్ పోటీలను నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యతి రాజ్, పీఈటీల సంఘ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వాసు, థామస్ పీటర్, స్కూల్ గేమ్స్ కార్యదర్శి విజయ తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీకగా..



హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా



- విరాజిల్లుతున్న ఏఎస్‌పేట దర్గా
- గంధ మహోత్సవం రేపు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని దర్గా మతసామరస్యానికి ప్రతీకగా విరాజిల్లుతోంది. దర్గాలో గంధ మహోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఏటా నెల్లూరు బారాషహీద్ దర్గాలో నిర్వహించే రొట్టెల పండగకు విచ్చేసే యాత్రికులు ఏఎస్‌పేటలోని నాయబ్ రసూల్, దొరసానమ్మల సమాధులను దర్శించుకొని తమ మొక్కులను చెల్లించుకోవడం ఆనవాయతీగా వస్తోంది.

అంగరంగవైభవంగా గంధ మహోత్సవం

హజరత్ నాయబ్‌రసూల్, దొరసానమ్మ గంధ మహోత్సవాన్ని ఆదివారం అర్ధరాత్రి అత్యంత వేడుకగా నిర్వహించనున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. మహోత్సవాన్ని వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో ఈఓ హుస్సేన్ ప్రతిష్ఠాత్మకంగా జరిపేందుకు చర్యలు చేపట్టారు. భక్తులకు అన్ని సౌకర్యాలను ఇప్పటికే కల్పించారు.

ఇలా చేరుకోవచ్చు..

నెల్లూరు నుంచి రహమతాబాద్ (ఏఎస్‌పేట)కు నేరుగా బస్సు సౌకర్యం ఉంది. కడప నుంచి వచ్చే భక్తులు ఆత్మకూరు పట్టణ పరిధిలోని నెల్లూరుపాళెంలో బస్సు దిగి రహమతాబాద్ బస్సెక్కాలి. ఆత్మకూరు నుంచి ప్రతి పది నిమిషాలకో బస్సును ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.

కూరగాయల మార్కెట్లో తనిఖీలు



సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్లో తూకాల్లో జరుగుతున్న మోసాలపై అధికారులు తనిఖీలను శుక్రవారం నిర్వహించారు. 'చెప్పిందే రేటు.. వేసిందే తూకం' అనే శీర్షికన సాక్షిలో కథనం గురువారం ప్రచురితమైంది. దీంతో లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలను చేపట్టారు. పలు షాపుల్లో తూకాల్లో తేడాలున్నాయనే అంశాన్ని గుర్తించారు. వినియోగదారులను ఇబ్బందులకు గురిచేసినా, తూకాల్లో మోసాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

బ్లాక్ ఫిల్మ్‌పై అధికారుల కన్నెర్ర

నెల్లూరు (టౌన్): కార్ల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్‌ను అతికించడంపై జిల్లా వ్యాప్తంగా రవాణా అధికారులు తనిఖీలను శుక్రవారం నిర్వహించారు. కార్లపై బ్లాక్ ఫిల్మ్‌ను అతికించడంపై 'వద్దంటే వినరే' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలో ఉప రవాణా కమిషనర్ చందర్ ఆదేశాల మేరకు జిల్లాలో బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. కార్లపై బ్లాక్ ఫిల్మ్, నిబంధనల మేరకు లేని నంబర్ ప్లేట్లు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాల్లేని 65 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ బాలమురళీకృష్ణ మాట్లాడారు. కార్లపై బ్లాక్ ఫిల్మ్‌ను ఎవరూ వినియోగించకూడదని చెప్పారు. నిబంధనలను పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎంవీఐ రఫీ, కార్తీక్, బాబు, ఏఎంవీఐ పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్.. చాలా గ్రేట్

- గత ప్రభుత్వంలో జిల్లాలో ఆరు ల్యాబ్‌ల ఏర్పాటు
- వీటితో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు
- నెలకు దాదాపు 1800 పరీక్షలు చేస్తున్న వ్యవసాయ శాఖ



ఇంటిగ్రేటెడ్ ల్యాబ్

నెల్లూరు(సెంట్రల్): గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలను అందిస్తూ వచ్చింది. ప్రధానంగా పంట వేసే ముందు విత్తనాల మొదలుకొని పంట పెరిగే కొద్దీ వేసే ఎరువుల విషయంలో రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించేలా చేయాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షల కోసం ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఈ ల్యాబ్‌లతో రైతులు ప్రస్తుతం ధైర్యంగా పరీక్షలు చేయించుకుంటున్నారు.

ఆరు చోట్ల ఏర్పాటు

జిల్లాలో ఎరువులు, విత్తనాల నాణ్యత పరీక్షల కోసం ఆరు చోట్ల ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రధానంగా కందుకూరు, కావలి, ఆత్మకూరు, కోవూరు, సర్వేపల్లి, ఉదయగిరి ప్రాంతాల్లో ఈ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఒక్కో ల్యాబ్‌ను రూ.1.5 కోట్లతో నిర్మించగా, అందులో పరికరాల కోసం మరో రూ.60 లక్షలను వెచ్చించింది. వీటిలో వ్యవసాయ శాఖకు సంబంధించిన ఏఓ, ఇద్దరు ఏఈఓలు రైతులకు అందుబాటులో ఉంటూ నాణ్యత పరీక్షలు నిర్వహిస్తుంటారు. ఉదయగిరిలో ఓ ల్యాబ్‌ను త్వరలోనే ప్రారంభించనున్నారు.



ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

విరివిగా పరీక్షలు

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లలో వరి విత్తనాల పరీక్షలను ఎక్కువగా నిర్వహిస్తుంటారు. వీటితో పాటు ఇతర విత్తనాలకూ పరీక్షలు చేస్తుంటారు. అదే విధంగా ఎరువుల నాణ్యతపై పరీక్షలు నిర్వహిస్తుంటారు. విత్తనాల్లో ఎంత నాణ్యత ఉందనే అంశంపై పరీక్ష చేస్తారు. అన్నీ తగిన విధంగా ఉంటేనే రైతులకు వివరాలను వెల్లడిస్తారు. వీటితో పాటు ఎరువుల నాణ్యతపై పరీక్షలు నిర్వహిస్తారు. అన్నీ సమానంగా ఉంటేనే రైతులకు వివరాలు చెప్తారు. ఒక్కో ల్యాబ్‌లో నెలకు 300 నుంచి 350 వరకు పరీక్షలు నిర్వహిస్తుంటారు.

ఆ సమయంలో ఇబ్బందులు

2014 – 19 మధ్య కాలంలో జిల్లాలో రైతుల సమస్యలు తీవ్రంగా ఉండేవి. విత్తనాలు, ఎరువుల విషయంలో నాణ్యత లేకుండా నాసిరకంగా ఉండే వాటిని రైతులకు సరఫరా చేయడంతో తీవ్రంగా నష్టపోయిన సందర్భాలున్నాయి. గతంలో ఇలాంటి పరీక్షలు చేయాల్సి వస్తే విజయవాడ తదితర ప్రాంతాలకు శాంపిళ్లను పంపేవారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని నాణ్యత ప్రమాణాలు నేరుగా రైతులే తెలుసుకునేలా ల్యాబ్‌ల ఏర్పాటుతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ల్యాబ్‌లతో ఎంతో మేలు



గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లతో రైతులకు ఎంతో మేలు కలుగుతోంది. ఒకప్పుడు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు నాణ్యతగా ఉన్నాయా లేదాననే విషయం తెలిసేది కాదు. ప్రస్తుతం వీటిని పరీక్షించి వాడుకోగలుగుతున్నాం.

– శ్రీహరి, గండ్లవీడు, ఆత్మకూరు మండలం

నేరుగా రైతులు పరీక్షలు చేయించుకోవచ్చు



ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లలో సమీప ప్రాంతాల్లోని రైతులు నేరుగా విత్తనాలు, ఎరువుల పరీక్షలు చేయించుకోవచ్చు. నాణ్యత ఎంత ఉందనే అంశంపై పరీక్షలు నిర్వహించి పూర్తి వివరాలను రైతులకు అందజేస్తారు. రైతులు ఈ అవకాశాన్ని బాగానే వినియోగించుకుంటున్నారు.

– సత్యవాణి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి